నేటి నుంచి తెరుచుకోనున్న పాఠశాలలు

రేపట్నుంచి ఎఫ్ఎ-3 పరీక్షలు

టెక్కలి : సంక్రాంతి సెలవుల అనంతరం ఈనెల 22వ తేదీ నుంచి ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు తెరుచుకోనున్నాయి. 13 రోజుల సెలవుల అనంతరం బడులు ప్రారంభం కానున్నాయి. ఈనెల 19వ తేదీ నుంచే పాఠశాలలు ప్రారంభం కావాల్సి ఉన్నా, రాష్ట్ర ప్రభుత్వం రెండు రోజుల పాటు అదనంగా సంక్రాంతి సెలవులను పొడిగించింది. పెంచిన రెండు రోజుల సెలవులు ఇతర సెలవు దినాల్లో పనిచేయాలని ప్రభుత్వం పేర్కొంది. అకడమిక్ కేలండర్ ప్రకారం ఈనెల 23వ తేదీ నుంచి ఎఫ్ఎ-3 పరీక్షలను నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన సిలబస్‌ని ముందస్తుగానే విడుదల చేశారు.

మందకొడిగా సాగు

- **రబీలో సాధారణ విస్తీర్ణం 2,16,340 ఎకరాలు**
- **81,518 ఎకరాల్లోనే పంటలు వేయగలిగిన రైతులు**
- **రిజర్వాయర్లలో అడుగంటిన నీటి నిల్వలు**
- **పంటల సాగుపై రైతుల్లో నెలకొన్న ఆందోళన**

జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల వేలాది ఎకరాల్లో రైతులు పంటలు వేయలేకపోయారు. సకాలంలో వర్షాలు కురవక వేసిన పంటలూ ఎండిపోయాయి. దీంతో రబీపైనే రైతులు ఆశలు పెట్టుకున్నారు. రబీలోనూ ప్రస్తుతం అవే పరిస్థితులు నెలకొన్నాయి. రబీలో వరి వేయొద్దని ఇప్పటికే అధికారులు రైతులకు సూచించారు. వర్షాలు లేకపోవడంతో వంశధార నామమాత్రపు ప్రవాహం ఉండగా, నాగావళి నదిలో నీటి ప్రవాహం జీరో లెవల్స్‌కు చేరింది. వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా ఉండడంతో రైతులు విత్తనాలు వేయలేకపోతున్నారు. ప్రతి ఏడాది డిసెంబరులో కురిసే వర్షాలతో నేలలో తేమశాతం పెరిగి అపరాల సాగుకు దోహదపడుతుంది. ఈ ఏడాది వర్షాల్లేకపోవడంతో అపరాల సాగుపైనా తీవ్ర ప్రభావం చూపింది. మొత్తమ్మీద రబీలో పంటల సాగు మందకొడిగా సాగుతోంది.

నందిగాం మండలం పెద్దతామరాపల్లి వద్ద వంశధార ప్రధాన ఎడమ కాలువలో గుర్రపుడెక్క

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

రబీలో సాధారణంగా అన్నిరకాల పంటలు కలిపి మొత్తం 2,16,340 ఎకరాల్లో సాగవుతుంది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 81,518 ఎకరాల (38 శాతం) మేర సాగు అయింది. వరి పంటను 21,150 ఎకరాల్లో వేస్తారని అంచనా వేయగా, 3047 ఎకరాల్లో (14 శాతం) వేశారు. మొక్కజొన్న పంటను 38,162.5 ఎకరాల్లో వేయాలని లక్ష్యంగా నిర్దేశించుకోగా 21,800 ఎకరాల్లో (57 శాతం) వేశారు. రాగులను 5,425 ఎకరాల్లో రైతులు వేస్తారని అంచనా వేయగా, ఇప్పటివరకు 1850 ఎకరాల్లో (34 శాతం) వేశారు. చెరుకు పంటను 3,675 ఎకరాల్లో వేయాల్సి ఉండగా 138 ఎకరాల్లో (4 శాతం) వేశారు. వేరుశనగ పంటను 10,660 ఎకరాల్లో వేయాల్సి ఉండగా 5,330 ఎకరాల్లో వేశారు. రబీలో 11,152 ఎకరాల్లో నువ్వులు వేయాలని లక్ష్యంగా నిర్ణయించగా, ఇప్పటివరకు 985 ఎకరాల్లోనే (7 శాతం) వేయగలిగారు. పొద్దుతిరుగుడు పంటను 848 ఎకరాల్లో వేయాలని లక్ష్యంగా నిర్దేశించుకోగా ఒక్క ఎకరాలోనూ విత్తనాలు వేయలేకపోయారు.

రైతుల్లో ఆందోళన

రబీలో అధిక శాతం మంది రైతులు ఆరుతడి పంటలే వేస్తారు. వీటికీ కాస్తాకూస్తో నీళ్లు అవసరం. వంశధార పరివాహక ప్రాంతంలో అధిక శాతం ఖరీఫ్ కోతలు పూర్తయ్యాయి. రైతులు వేరుశనగ, పెసలు, మినుములు, ఉలవలు వంటి పంటలు వేసేందుకు సిద్ధమవుతున్నారు. వరికి నీళ్లు ఇవ్వలేమని ఇప్పటికే అధికారులు ప్రకటించారు. ఒడిశాతో పాటు వంశధార క్యాచ్‌మెంట్ ఏరియాలో వర్షాభావ పరిస్థితుల వల్ల వంశధారలో గతంలో ఎన్నడూ లేని విధంగా నీటి ప్రవాహం పడిపోయింది. ప్రస్తుతం 300 క్యూసెక్కుల నీరు మాత్రమే ప్రవహిస్తోంది. హిరమండలం రిజర్వాయర్‌లో ఉన్న 2.5 టిఎంసిల నీటిని ఖరీఫ్‌లో చివరి తడుపులకు వినియోగించారు. ఫలితంగా రిజర్వాయర్‌లో నీటిమట్టం డెడ్ స్టోరేజీకి చేరింది. గొట్టా బ్యారేజీలో ఉన్న 0.6 టిఎంసిల నీటిని చెరువులు నింపడానికి కుడి, ఎడమ కాలువల ద్వారా నీటిని వదులుతున్నారు. సంక్రాంతి వరకే నీటిని సరఫరా చేయగలమని వంశధార అధికారులు ఈనెల ఎనిమిదో తేదీన ప్రకటన విడుదల చేయడంతో రైతుల్లో కలవరం మొదలైంది.

అపరాల సాగుపై ప్రభావం

డిసెంబరులో వర్షాలు పెద్దగా లేకపోవడంతో అపరాల సాగుపై తీవ్ర ప్రభావం చూపింది. నేలలో తేమ శాతం తక్కువగా ఉండడంతో మినుము, పెసర పంటలను వేయలేకపోయారు. రబీలో పెసర సాధారణ సాగు 46,645 ఎకరాలు ఉండగా ఇప్పటివరకు 17,698 ఎకరాల్లో (38 శాతం) సాగవుతోంది. మినుము సాధారణంగా 70,340 ఎకరాల్లో వేస్తారని అంచనా వేయగా 28,238 ఎకరాల్లో (40 శాతం) వేశారు. ఉలవలను 3,220 ఎకరాల్లో వేయాలని లక్ష్యంగా నిర్ణయించగా, 348 ఎకరాల్లో (11శాతం) వేశారు. కట్టె జనుమును 2,270 ఎకరాల్లో వేయాల్సి ఉండగా 2083 ఎకరాల్లో (92 శాతం) వేశారు. వర్షాలు లేకపోవడం, వంశధార, నాగవళిలో నీటి ప్రవాహం జీరో లెవల్స్‌కు పడిపోవడంతో పంటల సాగుపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

రిజర్వాయర్లల్లో అడుగంటిన నీటి నిల్వలు

మునుపెన్నడూ లేని విధంగా వంశధార, నాగావళి నదుల్లో నీటి ప్రవాహం దారుణంగా పడిపోయింది. ఒడిశాలోనూ వర్షాలు లేకపోవడంతో గడ్డు పరిస్థితులు నెలకొన్నాయి. ఖరీఫ్ చివరిలో పంటలు ఎండిపోతుండడంతో తోటపల్లి, మడ్డువలస నుంచి నీటిని విడిచిపెట్టి పంటలను కాపాడారు. మరోవైపు రిజర్వాయర్లలో నీటి నిల్వలు అట్టడుగుకు చేరాయి. గొట్టాబ్యారేజీ పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 0.66 టిఎంసిలు కాగా, ప్రస్తుతం 0.49 టిఎంసిలకు పడిపోయింది. తోటపల్లి రిజర్వాయర్ సామర్థ్యం 2.8 టిఎంసిలు కాగా ప్రస్తుతం 1.8 టిఎంసిల నీరే ఉంది. మడ్డువలస రిజర్వాయరు సామర్థ్యం 3.37 టిఎంసిలు కాగా, 1.05 టిఎంసిల నీరు మాత్రమే ఉంది. దీంతో రబీలో పూర్తిస్థాయిలో పంటల సాగుపై సందేహాలు నెలకొన్నాయి.

సంతకాల సమర్పణకూ అడ్డగింత

- **విజయవాడ వెళ్లనీయకుండా అడ్డుకున్న పోలీసులు**
- **పలువురు అంగన్వాడీల అరెస్టు, గృహ నిర్బంధం**

ఇచ్ఛాపురం : రైల్వేస్టేషన్‌కు వెళ్లకుండా అంగన్వాడీలను అడ్డుకున్న పోలీసులు

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం, సోంపేట, కంచిలి, పొందూరు, కోటబొమ్మాళి

కనీస వేతనం రూ.26 వేలు, గ్రాట్యుటీ అమలు తదితర సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన అంగన్వాడీలు 41 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నా పట్టించుకోని ప్రభుత్వం, వారి సమస్యలను సంతకాల రూపంలో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడంపైనా నిర్బంధాన్ని ప్రయోగించింది. ఈనెల 22న విజయవాడలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి కోటి సంతకాలను సమర్పించే కార్యక్రమానికి వెళ్లేందుకు సిద్ధమైన అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. కొందరిని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించగా, మరికొందరిని గృహ నిర్బంధం చేశారు. కోటి సంతకాల సమర్పణకు విజయవాడ వెళ్లవద్దంటూ పోలీసులు అంగన్వాడీలకు ఫోన్లు చేసి చెప్పారు. అయినా విజయవాడ వెళ్లేందుకు సిద్ధమవుతున్న అంగన్వాడీలను ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ వద్ద సిఐ ఇమాన్యుయేల్ రాజు, పట్టణ ఎస్ఐ గోవిందరావు ఆధ్వర్యాన పోలీసులు అడ్డుకున్నారు. అంగన్వాడీలను అరెస్టు చేసేందుకు పోలీసులు ప్రయత్నించగా వారు ప్రతిఘటించారు. దీంతో అంగన్వాడీ కార్యకర్తలు బస్టాండ్ వద్ద రోడ్డు మీద బైఠాయించి నినాదాలు చేశారు. దీంతో ట్రాఫిక్ అంతరాయం కలిగింది. రోడ్డుకు ఇరువైపులా ట్రాఫిక్‌లో వాహనాలు చిక్కుకున్నాయి. చివరకు అంగన్వాడీలను పోలీస్‌స్టేషన్‌కు తరలించగా, అక్కడ వారు ఆందోళన చేపట్టారు. అనంతరం వారిని ఇంటికి పంపించారు. అంగన్వాడీలు విజయవాడ వెళ్లకుండా రూరల్ ఎస్ఐ రమేష్ ఆధ్వర్యాన సిబ్బంది రైల్వేస్టేషన్ వద్ద నిఘా పెట్టారు. సోంపేటలో 39 మంది అంగన్వాడీలు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కంచిలిలో అంగన్వాడీ యూనియన్ నాయకులు మోహినితో పాటు పలువురికి నోటీసులు జారీ చేసి గృహ నిర్బంధం చేశారు. పొందూరులో పలువురిని గృహ నిర్బంధం చేసి విజయవాడ సంతకాల సమర్పణకు వెళ్లడం లేదంటూ నోటీసులపై సంతకాలు చేయించారు. అంగన్వాడీలకు ఫోన్లు చేసి పోలీస్‌స్టేషన్‌కు రావాలని పిలిచినా వారు వెళ్లకపోవడంతో, పోలీసులే వారి ఇళ్లకు వచ్చారు. కొంతమంది ఇళ్ల వద్ద లేకపోవడంతో పోలీసులు వెనుదిరిగారు.

ఇచ్ఛాపురం : అంగన్వాడీ యూనియన్ నాయకులు హైమను అరెస్టు చేస్తున్న పోలీసులు

పొందూరు : అంగన్వాడీ నాయకురాలు జ్యోతిలక్ష్మికి నోటీసులు ఇస్తున్న పోలీసులు

అంగన్వాడీల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

అంగన్వాడీల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.సుధ విమర్శించారు. కోటబొమ్మాళి ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయ అవరణలో సమ్మె శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని 41 రోజులుగా అంగన్వాడీలు సమ్మె చేస్తున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినా లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మొండివైఖరి వీడి అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీల సమ్మె సమంజసమైందని, నాలుగేళ్లుగా అనేక రకాలుగా ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా ప్రభుత్వం స్పందించకపోవడంతో చట్టబద్ధంగా సమ్మె చేపట్టారని తెలిపారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచకపోతే జీవనం ఎలా సాగుతుందని ప్రశ్నించారు. అంగన్వాడీల సమ్మెపై ఎస్మా ప్రయోగిస్తూ జిఒ నంబరు 2ను ప్రభుత్వం జారీ చేయడం, నోటీసులు ఇస్తూ బెదిరింపులకు పాల్పడడం సరికాదన్నారు. అంగన్వాడీలకు ఎస్మా వర్తించదని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీని అమలు చేయాలన్నారు. తెలంగాణ కంటే అదనంగా వేతనాలు పెంచుతామన్న ముఖ్యమంత్రి హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. మినీ అంగన్వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ జిఒ ఇవ్వాలన్నారు.

సోంపేట : పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

లెనిన్ స్ఫూర్తితో సమరశీల పోరాటాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

తొలి సోషలిస్టు విప్లవాన్ని సాధించిన మహా విప్లవ నేత లెనిన్ స్ఫూర్తితో సమరశీల పోరాటాలకు సన్నద్ధం కావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. సిపిఎం నాయకులు కె.శ్రీనివాసు అధ్యక్షతన నగరంలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో లెనిన్ శత వర్ధంతి సభను ఆదివారం నిర్వహించారు. లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రామిక వర్గ విప్లవ నేత, 20వ శతాబ్దపు గొప్ప మార్క్సిస్టు మేధావి, ప్రపంచంలోనే మొట్టమొదటి శ్రామికవర్గ రాజ్యం సోవియట్ యూనియన్‌ను సాధించిన ఘనత లెనిన్ నాయకత్వానికి దక్కుతుందన్నారు. కష్టపడి సంపద సృష్టించే రైతులు, కూలీలు, కార్మికులు, మధ్యతరగతి ఉద్యోగులు, వృత్తిదారులు తదితరులకే సంపదపై అధికారం ఉండాలని, అలాంటి వారికే రాజ్యాధికారం కావాలని పోరాడారని తెలిపారు. అసమానతల్లేని సోషలిస్టు సమాజ నిర్మాణానికి పునాదులు వేశారని చెప్పారు. పెట్టుబడిదారీ దోపిడీకి విరుగుడు సోషలిజమేనని ఆయన ఆచరణలో రుజువు చేశారని తెలిపారు. ప్రజల సంపద కార్పొరేట్ల పాలవుతున్న ప్రస్తుత కాలంలో లెనిన్ ఆవశ్యకత మరింత పెరిగిందన్నారు. లెనిన్ సిద్ధాంతం దేశ అభ్యున్నతికి, యువత బంగారు భవిష్యత్‌కు మార్గదర్శకం అవుతుందన్నారు. లెనిన్ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సభలో సిపిఎం నాయకులు కె.మోహనరావు, వి.జి.కె మూర్తి, ఎస్.భాస్కరరావు, కె.అప్పారావు, కె.నాగమణి, ఎ.మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

లెనిన్ చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న సిపిఎం నాయకులు

టెక్కలి రూరల్ : టెక్కలిలో సిపిఎం కార్యాలయంలో కె.ధర్మారావు అధ్యక్షతన నిర్వహించిన సభలో లెనిన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి మాట్లాడారు. సభలో సిపిఎం నాయకులు కె.కామేశ్వరరావు, ఎన్.షణ్ముఖరావు, కొల్లి ఎల్లయ్య, బగాది వాసు తదితరులు పాల్గొన్నారు.

పలాస : మండలంలోని మామిడిపల్లిలో లెనిన్ చిత్రపటానికి సిపిఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర నాయకులు బొడ్డు వాసుదేవరావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

రేపు షర్మిల జిల్లా పర్యటన

- **ఇచ్ఛాపురంలో కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశం**
- **డిసిసి అధ్యక్షులు పి.పరమేశ్వరరావు**

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పిసిసి) అధ్యక్షులుగా వైఎస్ షర్మిల బాధ్యతల స్వీకరణ అనంతరం తొలిసారిగా శ్రీకాకుళం జిల్లాలో పర్యటించనున్నారని డిసిసి అధ్యక్షులు పేడాడ పరమేశ్వరరావు తెలిపారు. ఈమేరకు ఆదివారం ఒక ప్రకటనను విడుదల చేశారు. 23న విశాఖపట్నం నుంచి రోడ్డుమార్గాన ఉదయం పది గంటలకు ఇచ్ఛాపురం చేరుకుంటారని తెలిపారు. కీర్తిశేషులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాదయాత్ర ముగించిన విజయ స్థూపం వద్దకు వెళ్లి ఆయనకు నివాళ్లర్పిస్తారని పేర్కొన్నారు. అనంతరం ఇచ్ఛాపురం పట్టణంలోని ఆర్.జె ఫంక్షన్ హాలులో నిర్వహించే కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో ప్రసంగిస్తారని తెలిపారు. ఆమెతో పాటు పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు హాజరు కానున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ శ్రేణులు ఆమెకు ఘన స్వాగతం పలకడంతో పాటు విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

IN THE COURT OF THE
HON'BLE VTH JUNIOR' CIVIL
JUDGE; CITY CIVIL COURT
AT HYDERBAD
O.S.NO. 2714 OF 2022

Between:
M/s. Eugia Pharma Specialities Ltd.,
...Plaintiff
AND
L. UDAYKUMAR & Others
...Defendants

To,
1. THEEDA HARI BABU. S/O T. SANYASAYYA AGED 54 YEARS. OCC: FARMER, HNO; 2-38 SANTHA GOWRAMPETA, S. KOTA, VIZIANAGARAM DIST PIN; 535145
2. PELURU RAVI KUMAR, S/O P. SANJEEVI AGED 28 YEARS, OCC; PRIVATE SERVICE, R/O 2-41 RAMANA VEEDHI, MAHADEVI VALLASA SRIKAKULAM-DIST-532460
...Defendants No. 2 and 3

WHEREAS the Plaintiff Company filed the above suit against you for recovery of damages, the above suit is posted to 5-02-2024 for your appearance, you are hereby summoned to appear either in person or through your pleader with your defence if any at 10.30 a.m., on the above said date before the Hon'ble Court failing which the suit will be heard and determined exparte.

// BY ORDER OF THE COURT//
R. CHAKRA DHAR
V. VIMALA NAND
ADVOCATE'S
#6-1/295/1, II ND FLOORE
PADMA RAO NAGAR
SECUNDERA BAD

వైసిపిని గద్దె దించితేనే రాష్ట్రాభివృద్ధి

టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్, సరుబుజ్జిలి, బూర్జ

వచ్చే ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వాన్ని ప్రజలు సాగనంపితే తప్ప రాష్ట్రాభివృద్ధి సాధ్యం కాదని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో, సరుబుజ్జిలి మండల కేంద్రంలోని ఒక కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన జయహో బిసి కార్యక్రమంలో మాట్లాడారు. నాలుగున్నరేళ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజలకూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అన్యాయం చేశారని విమర్శించారు. రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు దెబ్బతిని వేలాది మంది ఇతర రాష్ట్రాలకు వలసలు పోవాల్సిన దయనీయ పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ అనుచరుల సొంత, బినామీ కంపెనీల్లో తయారు చేసిన నాసిరకం మద్యం అమ్మకాలు సాగిస్తూ ప్రజల ఆరోగ్యాలను దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. మద్య నిషేధం చేశాకే ఓటు అడుగుతానని చెప్పిన జగన్, ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని ఓట్లడుగుతున్నారని ప్రశ్నించారు. ప్రజలపై పన్నులు, ధరల భారాన్ని మోపారని ధ్వజమెత్తారు. బిసిలకు ఏటా రూ.15 వేల కోట్లు ఖర్చు చేస్తామని నమ్మబలికిన జగన్, కార్పొరేషన్లుగా విభజించి పార్టీ నాయకులకు పదవులు ఇచ్చి ఉత్సవ విగ్రహాలుగా నిలిపారన్నారు. కార్పొరేషన్లను నిర్వీర్యం చేశారని దుయ్యబట్టారు. చివరకు సబ్‌ప్లాన్ నిధులను దళితుల ప్రయోజనాలకు ఇవ్వకుండా దారిమళ్లించారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో బిసిలు వైసిపికి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. సమావేశంలో టిడిపి సరుబుజ్జిలి మండల అధ్యక్షులు ఎ.రాంబాబు, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, బిసి సెల్ కార్యదర్శి బోర గోవిందరావు, జిల్లా అధ్యక్షులు కలగ జగదీష్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి శివ్వాల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.అలాగే బూర్జ మండలం డొంకలపర్త, నీలాపురం, అల్లెన, బూర్జ గ్రామాల్లో రవికుమార్ విస్తృతంగా పర్యటించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు ఎ.రామకృష్ణ, గణపతి పాల్గొన్నారు.

'దువ్వాడ'పై ధిక్కార స్వరం

సంతబొమ్మాళిలో బయటపడిన అసమ్మతి పోరు

ప్రజాశక్తి - నౌపడ

టెక్కలి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్తగా దువ్వాడ శ్రీనివాస్‌ను అధిష్టానం ప్రకటించడంపై సంతబొమ్మాళి మండలానికి చెందిన అసమ్మతి నాయకులు ధిక్కార స్వరం వినిపించారు. ఆకాశలఖవరం పంచాయతీలో 13 మంది సర్పంచ్‌లు, తొమ్మిది మంది ఎంపిటిసిలతో పాటు పలువురు నాయకులు ఆదివారం సమావేశమయ్యారు. సొంత పార్టీ నాయకులు, కార్యకర్తలకు పనులు చేసి పెట్టలేని నాయకులు తమకు వద్దంటూ నినాదాలు చేశారు. తన కుటుంబాన్ని పట్టించుకోలేని వ్యక్తి ప్రజలకు ఏం న్యాయం చేస్తారని విమర్శించారు. నాలుగున్నరేళ్లుగా నాయకులు, కార్యకర్తలను విస్మరించి... ఇప్పుడు ఓట్ల కోసం రాజకీయం చేస్తున్నారని దుయ్యబట్టారు. మూలపేట పోర్టు నిర్వాసితుల్లో అనైక్యతను సృష్టించి పబ్బం గడుపుకుంటున్నారని విమర్శించారు. స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించకుండా పోర్టు కాంట్రాక్టు సొమ్ము తన ఖాతాలో వేసుకుని రూ.లక్షలను దోచుకుంటున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లామని, వారం రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. స్థానికులకు తగిన ప్రాధాన్యత కల్పించకపోతే నిరాహార దీక్ష చేపడతామని, అవసరమైతే ఆమరణ నిరాహార దీక్షకూ వెనుకాడబోమని హెచ్చరించారు. దువ్వాడ తీరుతో ప్రభుత్వంలో ఉండీ పనులు చేసుకోలేకపోయామని, ప్రజల్లో ఎలా తిరగాలని ప్రశ్నించారు. పార్టీకి తాము విధేయులమే గానీ దువ్వాడకు మాత్రం సహకరించేది లేదని తేల్చిచెప్పారు. ఎనిమిది నెలలుగా నియోజకవర్గ సమన్వయకర్తగా బాధ్యతలు నిర్వర్తించిన దువ్వాడ వాణికి అధిష్టానం న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో ఎఎంసి చైర్మన్ సుగ్గు పుణ్యవతి, వైసిపి మండల అధ్యక్షులు జీరు బాబూరావు, నాయకులు సుగ్గు రామిరెడ్డి, బి.మోహన్ రెడ్డి, కె.అప్పారావు, డి.భూషణ్‌రెడ్డి, ఆర్.రామిరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సుగ్గు రామిరెడ్డి

25న జాతీయ ఓటరు దినోత్సవం

ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎం.నవీన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఓటు ప్రాధాన్యం తెలిసేలా 14వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఈనెల 25వ తేదీన నిర్వహించాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎం.నవీన్ ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ ఓటర్ల దినోత్సవం రోజున 'నథింగ్ లైక్ ఓటింగ్', 'ఐ ఓట్ ఫర్ ష్యూర్' నినాదాలతో ఓటరు ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా, బూత్‌స్థాయిలో జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా యువత, సీనియర్ సిటిజన్లకు ఓటరు దినోత్సవ అవశ్యకత తెలియజేయాలని పేర్కొన్నారు.

పోలింగ్ బూత్‌ల్లో నిర్వహించే కార్యక్రమాల్లో కొత్త ఓటరుగా నమోదైన వారికి ఎపిక్ కార్డులు అందించి సత్కరించాలని ఎఇఆర్ఒలు, ఇఆర్ఒలు అందుకు తగిన ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. జిల్లాలోని అన్ని పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులు ప్రతిజ్ఞ కార్యక్రమంలో భాగస్వాములయ్యేలా ఆయా శాఖల ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

IN THE COURT OF THE
HON'BLE VTH JUNIOR' CIVIL
JUDGE; CITY CIVIL COURT
AT HYDERBAD
O.S.NO. 2007 OF 2020

Between:
M/s. Aurobindo Pharma Ltd.,
...Plaintiff
AND
NAMALA. SHIVA & Others
...Defendants

To,
1. KIKRUSHNA RAO. S/O K. DHARMA RAO PEDDA ST. P. SASANAM - POST SARADAPURAM, SRIKAKULAM-DIST A.P- 532284
...Defendants No. 3

WHEREAS the Plaintiff Company filed the above suit against you for recovery of damages, the above suit is posted to 16-02-2024 for your appearance, you are hereby summoned to appear either in person or through your pleader with your defence if any at 10.30 a.m., on the above said date before the Hon'ble Court failing which the suit will be heard and determined exparte.

// BY ORDER OF THE COURT//
K. VENU GOPAL REDDY
K. NARA SIMHA REDDY
ADVOCATE'S
#4-92/2/A, 1ST FLOORE
OPP: MEE SEVA & GHMC
CHANDANAGAR,
HYDERBAD-050

రాష్ట్ర వాలీబాల్ జట్టుకు అభిరామ్ ఎంపిక

అభిరామ్

ప్రజాశక్తి- కవిటి

ఈనెల 31వ తేదీ వరకు జరగనున్న ఖేల్ ఇండియా యూత్ నేషనల్ గేమ్స్‌లో రాష్ట్ర వాలీబాల్ జట్టు తరుపున మండలంలోని ప్రగడపుట్టుగకు చెందిన బడ్డ అభిరామ్ పాల్గొననున్నట్టు డిఎస్‌డిఒ కల్లేపల్లి శ్రీధరరావు ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈ నెల 11న జరిగిన ఖేల్ ఇండియా రాష్ట్ర వాలీబాల్ జట్టు ఎంపికలో చక్కటి ప్రతిభ కనబరిచిన అభిరామ్ రాష్ట్ర వాలీబాల్ జట్టుకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాలం అశోక్, పిఇటి పిడిఎస్ అడ్వైయిజర్ సుందరరావు, వాలీబాల్ జిల్లా కార్యదర్శి పోలినాయుడు, వాలీబాల్ జిల్లా కోచ్ హరిబాబు, జాయింట్ సెక్రటరీ బల్లెడ రమేష్, పీడీ, పిఇటిల అధ్యక్షుడు ఎస్.వి.రమణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ వై.వి.రమణ, ట్రెజర్ సతీష్ అభిరామ్‌కు అభినందనలు తెలిపారు.

పురస్కారాన్ని అందుకుంటున్న నారాయణమూర్తి

నారాయణమూర్తికి పురస్కారం

టెక్కలి : మండలంలోని రావివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో ఆంగ్ల ఉపాధ్యాయునిగా విధులు నిర్వర్తిస్తున్న మార్పు నారాయణమూర్తికి జైఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్సులో స్థానం లభించి పురస్కారాన్ని అందుకున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ చిత్రకారులు బాపు జయంతి సందర్భంగా తెలంగాణా రాష్ట్రం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని సినీరచయిత, నటుడు తనికెళ్ల భరణీ చేతుల మీదుగా అందుకున్నారు. బాపూ కళాసేవ అనే ఆంశంపై నిర్వహించిన చిత్రాలు పోటీల్లో నారాయణమూర్తి గీసిన చిత్రానికి ఈ పురస్కారం లభించింది. ఈ మేరకు జై ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ వారి ధ్రువీకరణ పత్రంతో పాటు, బాపు చిత్రకళా ఆవార్డుని ఆందుకున్నారు. కార్యక్రమంలో ఆధికార భాషా సంఘం చైర్మన్ పి.విజయబాబు, సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, టి.సుభాషిణీ తదితరులు పాల్గొన్నారని తెలిపారు. నారాయణమూర్తికి లభించిన పురస్కారంపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు భారతి, ఉపాధ్యాయులు ధర్మారావు, వడగ భాస్కరరావు అభినందించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

పలాస : వారంతా చిన్ననాటి స్నేహితులు.. ఒకేచోట చదువుకున్నారు.. పదో తరగతి పూర్తయ్యాక కొంతమంది ఉద్యోగాలు చేస్తుండగా, మరికొంత మంది వ్యాపారం, ఇతర రంగాల్లో స్థిరపడ్డారు. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1988-89 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం పలాస రైల్వే ఇనిస్టిట్యూట్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాల నడుమ నాటి మధుర స్మృతులను నెమరేసుకున్నారు. 120 మంది పూర్వ విద్యార్థులందరూ ఒకేచోట చేరవడంతో సందడి నెలకొంది.

మార్చి 9, 10న మహాసభలు

పలాస : హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన భవనంలో తెలుగు సంయుక్త రాష్ట్రాల పౌర హక్కుల సంఘం రాష్ట్ర మహాసభలను మార్చి 9, 10 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు పత్రి దానేష్ తెలిపారు. కాశీబుగ్గ తాళభద్రలో ఆదివారం రాష్ట్ర మహాసభలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హైదరాబాద్‌లో జరిగే మహాసభలు ప్రజలు ప్రజాస్వామ్యవాదులు, మేధావులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పిండి వెంకటరావు, ఉపాధ్యక్షులు రామారావు, సహాయ కార్యదర్శి సోమనాథం, జిల్లా కార్యవర్గ సభ్యులు లక్ష్మణ్, వైకుంఠరావు, పూర్ణ, కృష్ణ, ఢిల్లీరావు, జోగారావు పాల్గొన్నారు.

డిజిటల్ విద్యా విధానం అవసరం

పరీక్షల విభాగం డైరెక్టర్ జనరల్ డి.దేవానంద్ రెడ్డి

పుస్తకాలను ఆవిష్కరిస్తున్న దేవానంద్ రెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మారుతున్న కాలానుగుణంగా డిజిటల్ విద్యా విధానాన్ని ఉపాధ్యాయులు అలవరుచుకోవాలని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ జనరల్ డి.దేవానంద్ రెడ్డి అన్నారు. నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎపి సాంఘికశాస్త్ర ఉపాధ్యాయ ఫోరం ఆధ్వర్యాన రాష్ట్రస్థాయి సాంఘికశాస్త్ర విద్యా, వైజ్ఞానిక సదస్సును ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తి జీవన గమనంలో సాంఘిక శాస్త్రం నైతిక విలువలు నేర్పి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతుందన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో నైతిక విలువల ఆవశ్యకత ఉందన్నారు. శ్రీకాకుళం రాష్ట్రస్థాయి సదస్సుకు వేదిక కావడం అభినందనీయమన్నారు. ఉప జిల్లా విద్యాశాఖాధికారులు ఆర్.విజయ కుమారి, జి.పగడాలమ్మ మాట్లాడుతూ ఉపాధ్యాయులు తన బోధన ద్వారా విద్యార్థుల్లో సామాజిక స్పృహ పెంపొందించాలని కోరారు. వమరవల్లి డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.తిరుమల చైతన్య మాట్లాడుతూ ఆధునిక బోధనా పద్ధతులు, సాంకేతికత బోధనలో జోడించాల్సిన అవసరం ఉందన్నారు. నూతన భారత పార్లమెంట్ భవన్ నమూనా, విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంఘిక శాస్త్ర ప్రాజెక్టులు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఫోరం తయారు చేసిన టీచింగ్ డైరీ, పాఠశాల రాజ్యాంగం అనే పుస్తకాలను ఆవిష్కరించారు. ఫోరం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.ఎస్.వి కృష్ణారెడ్డి, కె.సురేష్ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయ ఫోరం చేస్తున్న కృషిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఫోరం జిల్లా అధ్యక్షులు వై.వి.రమణ అధ్యక్షత వహించిన సదస్సులో ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి బాడాన రాజు, డిసిఇబి సెక్రటరీ జి.రాజేంద్రప్రసాద్, రాష్ట్ర నాయకులు శేఖర్, జి.మురళీమోహన్, ఎస్.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మూల్యాంకన బకాయిలు చెల్లించాలి

పదో తరగతి మూల్యాంకన బకాయిలు చెల్లించాలని, మూల్యాంకనానికి శాశ్వత భవనాన్ని నిర్మించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కిషోర్‌కుమార్, పూర్వ అధ్యక్షులు పొందూరు అప్పారావు కోరారు. డైరెక్టర్ జనరల్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్ దేవానందరెడ్డి ఆదివారం శ్రీకాకుళం వచ్చారు. ఈ మేరకు ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెరిగన ధరలకు అనుగుణంగా రెమ్యూనరేషన్ పెంచాలని, దూర ప్రాంత మండలాలకు ప్రత్యేకంగా అందుబాటులో ఉన్న ప్రాంతంలో మూల్యాకన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

కార్యక్రమంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.బాబూరావు, బి.శ్రీరామ్మూర్తి, జిల్లా సహాధ్యక్షులు కె.దాలయ్య, జిల్లా కార్యదర్శి వై.వాసుదేవరావు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ బి.గౌరీశ్వరరావు, జిల్లా నాయకులు జగదీశ్వరరావు, సురేష్ పాల్గొన్నారు.

దాతల కోసం ఎదురుచూపులు

ఇద్దరు చిన్నారులతో లత

ప్రజాశక్తి- కవిటి

కడదాక తోడుంటానని పెళ్లినాడు ప్రమాణాలు చేసిన ఆమె భర్తను విధి నిర్వహణలో మృత్యువు కబళించింది. పిల్లాపాపలతో నూరేళ్ల సంసార జీవితంపై ఎన్నో ఆశలు పెట్టుకున్న ఆమెకు అనుకోని ఈ సంఘటన అగాథంలోకి నెట్టేసింది. 25 ఏళ్లు దాటకుండానే ఇద్దరు చిన్నారులతో ప్రస్తుతం ఆమె దిక్కుతోచని స్థితిలో ఉంది. ఏ పేదరికమైతే లేకుండా నిన్ను చూసుకుంటానని ఆమె భర్త చెప్పాడో అవే మాటలు తలచుకుంటూ తన బిడ్డల భవిష్యత్, తన పొట్టకూటికై దాతల సాయం కోసం ఎదురుచూపులు చూస్తోంది శీమూరు గ్రామానికి చెందిన శివంగి లత. వివరాల్లోకి వెళ్తే... కవిటి మండలం శీమూరుకు చెందిన శివంగి దివాకర్ కేరళలో వలస కూలీగా పనిచేసేవాడు. విధి నిర్వహణలో ఉండగా వారం రోజుల క్రితం ప్రొక్లెయినర్ కిందపడి మృతి చెందారు. దీంతో అతని భార్య లత, కుమారుడు లక్కీ (2), కుమార్తె సాక్షిత్ (3 నెలలు) దిక్కులేనివారయ్యారు. పేదరికంలో పుట్టిన దివాకర్ తన కుటుంబాన్ని చక్కగా చూసుకోవాలనే లక్ష్యంతో కేరళలో కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కానీ, అనుకోని ఈ సంఘటన వారి కుటుంబంలో విషాదం నింపింది. సంక్రాంతి పండగ పూట ఇద్దరు చిన్నారులతో లతను చూస్తున్నవారి గుండె తరుక్కుపోతోంది. తమకు తోచిన సాయం చేస్తూ, తెలిసిన వారిని లతను ఆదుకోవాలని కోరుతున్నారు. అందులో భాగంగా కవిటి మండలం కపాసుకుద్దికి చెందిన అగ్నికుల క్షత్రియ యువజన సంఘం సభ్యులు తమవంతుగా లతకు ఇటీవల రూ.40 వేలు అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ దయనీయ స్థితిలో ఉన్న లతను దాతలు ఉదారంగా ఆదుకోవాలని, దాతలు ఆమె ఫోన్ పే నంబర్ 9701840110కు సాయం అందించాలని కోరారు.

ఎంపీ ఎవరైనా టెక్కలి వారే

ప్రజాశక్తి- టెక్కలి

రాజకీయాల్లో విచిత్ర పరిణామాలు చోటుచేసుకోవడం సాధారణమే. అయితే మరికొద్ది నెలల్లో జరగనున్న లోకసభ ఎన్నికల్లో జిల్లా ఎంపీగా ఏ పార్టీకి చెందిన వారు విజయం సాధించినా వారు టెక్కలి నియోజకవర్గానికి చెందిన వారే కావడం గమనార్హం. ఎన్నికలకు సంబంధించి నోటిపికేషన్ ఇంకా వెలువడనప్పటికీ ప్రధాన రాజకీయ పార్టీలన్నీ ఎన్నికలకు సిద్ధం అవుతున్నాయి. ఈ క్రమంలో తమ పార్టీ తరుపున పోటీ చేసే ఆభ్యర్థుల జాబితాను వెలువరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అధికార పార్టీ వైసిపి తమ ఎంపీ అభ్యర్థిగా పేరాడ తిలక్ పేరును ఇటీవల ఖరారు చేసింది. ఈయన టెక్కలి నియోజకవర్గ నందిగాం మండలం కణితూరుకు చెందిన వ్యక్తి. టిడిపి నుంచి ప్రస్తుత ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అభ్యర్థిత్వం దాదాపు ఖారారే. ఈయనా టెక్కలి నియోజకవర్గం కోటబొమ్మాళి మండలం నిమ్మాడకు చెందిన వ్యక్తి. కాగా, కాంగ్రెస్ పార్టీ నుంచి మాత్రం ప్రస్తుతం జిల్లా అధ్యక్షులు డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు ఉన్నారు. దాదాపుగా ఈయనా ఎంపీగా పోటీ చేసే అవకాశాలు ఉన్నాయి. ఈయనదీ టెక్కలి మండలం పాతనౌపడ. ఇలా ఎంపీగా పోటీ చేసే ఈ ప్రధాన పార్టీల అభ్యర్థులు బరిలో ఉన్న నేపథ్యంలో వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఎవరు విజయం సాధించినా వారు టెక్కలి నియోజకవర్గానికి చెందిన వారే కావడం విశేషం.

దరఖాస్తులకు ఆహ్వానం

పలాస : మండలంలోని బ్రాహ్మణతర్లా హోమియో ఆస్పత్రిలో పార్టుటైం యోగా శిక్షకులుగా పనిచేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వైద్యులు దుర్గాప్రసాద్ పట్నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. హోమియో ఆస్పత్రిలో పురుషులకు, స్త్రీలకు వేర్వేరుగా యోగా శిక్షణ ఇచ్చేందుకు ఒక పురుషుడు, ఒక స్త్రీ అవసరమని తెలిపారు. డిగ్రీ అర్హతతో పాటు యోగాలో అనుభవం ఉన్న పురుషులు, స్త్రీలు దరఖాస్తు చేసుకోవచ్చు అన్నారు. స్త్రీకు రూ.5 వేలు, పురుషుడుకు రూ.8 వేలు వేతనం చెల్లిస్తామని చెప్పారు. ఈ నెల 24లోగా దరఖాస్తు చేసుకొనేందుకు చివరి తేదీ అని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి వితరణ

కవిటి: మండలంలోని బెహరా వీధిలో పునర్నిర్మిస్తున్న జగన్నాథస్వామి ఆలయ నిర్మాణానికి ఉప సర్పంచ్ డి.కుమారి రూ.10 వేలు ఆలయ కమిటీ సభ్యులకు ఆదివారం అందించారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ ప్రతినిధి దుర్యోధన మాట్లాడుతూ ఎంతో పురాతనమైన జగన్నాథ స్వామి ఆలయ నిర్మాణానికి దాతలు ఉదారంగా విరాళాలు అందివ్వాలని కోరారు. కార్యక్రమంలో గిరి బెహరా, తిరుపతి బెహరా, సంతు బెహరా, ఖగపతి బెహరా, త్రినాథ్ బెహరా, దొంబురు బెహరా, దుర్గా బెహరా, దేవా బెహరా పాల్గొన్నారు.

నగదును అందిస్తున్న దుర్యోధన

ప్రమాదంలో నుజ్జయిన కారు

కారు బోల్తా : నలుగురికి గాయాలు

పలాస : మండలంలోని కొబ్బరిచెట్లూరు సమీపంలో కలకత్తా నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న కారు ఆదివారం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కలకత్తాకు చెందిన టకీర్, వస్తానే షేర్, పిల్లలు నషీయ, హసీయాలు గాయపడ్డారు. వెంటనే స్థానికులు 108లో పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయింది. కాశీబుగ్గ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

సెల్‌ఫోన్ అందజేస్తున్న సిఐ ఇమాన్యుల్‌రాజు

ఇచ్ఛాపురం : పట్టణంలో సెల్‌ఫోన్ పోయిన 24 గంటలకు ముందే పోలీసులు సకాలంలో స్పందించి బాధితుడికి తిరిగి ఫోన్ అందించిన తీరుపై సర్వత్రా హర్షం వ్యక్తం చేశారు. ఇచ్ఛాపురానికి సమీపంలో ఉన్న ఒడిశా రాష్ట్రం జయంతపుర్‌కు చెందిన గణేష్ కుమార్‌సాహు ఇచ్ఛాపురం మార్కెట్‌కు శనివారం వచ్చారు. మార్గంమధ్యలో తన యొక్క మొబైల్ ఫోను పోయింది. ఆదివారం టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు మొబైల్ ఫోను గుర్తించి వారికి 24 గంటల్లోపే అందించారు. కేసును ఛేదించిన కానిస్టేబుళ్లను సిఐ ఇమాన్యుల్ రాజు అభినందించారు.

ఘాటు వద్ద నివాళ్లర్పిస్తున్న ఎమ్మెల్యే అశోక్

ఘనంగా ప్రకాష్ జయంతి

ప్రజాశక్తి- కవిటి

ఆంధ్రాబ్యాంకు మాజీ డైరెక్టర్, మాజీ ఎంపిపి, ఎమ్మెల్యే అశోక్ తండ్రి కీర్తిశేషులు బెందాళం ప్రకాష్ జయంతి వేడుకలు పార్టీ నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, టిడిపి శ్రేణులు, ప్రకాష్ అభిమానులతో కలిసి ఎమ్మెల్యే అశోక్ రామయ్యపుట్టుగలోని ప్రకాష్ ఘాట్ వద్ద నివాళ్లర్పించారు. ప్రగడపుట్టుగని వాలీబాల్ క్రీడా మైదానంలోని ప్రకాష్ విగ్రహానికి ఆయన అభిమానులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం టిడిపి ఆవిర్భావం నుంచి పార్టీ బలోపేతానికి ప్రకాష్ చేసిన సేవలు గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సీపాన వెంకటరమణ, బెందాలం రమేష్, మనిచంద్ర ప్రకాష్, పుల్లట సంతోష్, బాసుదేవ్ రౌలో, ప్రగడ మణిబాబు, బల్లెడ రమేష్, వజ్జ రంగారావు, శ్రీరామ్మూర్తి, బిసాయి, బిమ్మో సాహు, బదకల ప్రసాదరావు, బండారు మిన్నారావు, పిరియా శివాజీ పాల్గొన్నారు.

24న విశాఖలో విచారణ

టెక్కలి : ఈనెల 24న విశాఖపట్నంలో జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ కార్యాలయంలో విచారణ జరగనుందని సమాచార హక్కు చట్టం రక్షణ వేదిక జిల్లా అధ్యక్షులు అనపాన షణ్ముఖరావు ఒక ప్రకటనలో తెలిపారు. సంతబొమ్మాళి మండలం మూలపేట వద్ద నిర్మిస్తున్న పోర్టు నిర్మాణ వ్యయంలో భవన నిర్మాణ రంగ కార్మికులకు, ఇతర నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమానికి ఒక శాతం సెస్సు నిధులు మంజూరు చేయాలన్న ఆర్‌టిఐ దరఖాస్తు మేరకు విచారణ చేపడుతున్నట్లు చెప్పారు. పోర్టు నిర్మాణ వ్యయం ఎంత, అందులో నుంచి కార్మికులకు చెల్లించాల్సిన ఒక శాతం సెస్సు నిధులు ఎంత అనేది కార్మికశాఖాధికారులు జారీ చేసిన నోటీసు మేరకు తెలపాలన్నారు. ఈ విచారణకు సంబంధిత పోర్టు అధికారులు, తాము హాజరవుతున్నామని తెలిపారు.

టిడిపితోనే అభివృద్ధి

కవిటి: టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే అశోక్ అన్నారు. మండలంలోని ఎర్రగోవిందపుట్టుగలో ఆదివారం నిర్వహించిన సామంత కుల ఆత్మీయ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. మరికొద్ది రోజుల్లో టిడిపి – జనసేన ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, అప్పుడు అన్ని తరగతుల సమస్యలు పరిష్కరించి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని అన్నారు. అనంతరం సామంత కులం తరుపున ఎమ్మెల్యే అశోక్‌ను ఘనంగా సన్మానించారు.

పుణ్యవతిని సన్మానిస్తున్న నాయకులు

ఎఎంసి చైర్‌పర్సన్‌కు సన్మానం

సంతబొమ్మాళి : కోటబొమ్మాళి ఎఎంసి చైర్‌పర్సన్‌గా సుగ్గు పుణ్యవతి ఇటీవల నియమితులయ్యారు. ఈ మేరకు మండలంలోని ఆకాశలక్కువరంలో సర్పంచ్‌లు దుక్క భూషణరెడ్డి, జోగి రాములమ్మ, బుడ్డా మోహన్‌రెడ్డి, రెయ్య రామిరెడ్డి, అంగ జనార్ధన్, జీరు బాబూరావు, యర్నాగుల రామరాజు, కళింగపట్నం అప్పారావు, ఎంపిటిసి బత్సల సుధాకర్, ఎంపిటిసి ప్రతినిధి అంగ ఆప్పారావులు ఆదివారం ఆమెకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా పుణ్యవతి మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు కల్పించిన ఘనత సిఎం జగన్మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు.

పారదర్శకంగా కులగణన

పరిశీలిస్తున్న గిరిబాబు

పొందూరు: ప్రభుత్వం చేపడుతున్న కులగణను సంబంధిత సిబ్బంది పారదర్శికంగా చేపట్టాలని రాపాక సర్పంచ్ ప్రతినిధి కొంచాడ గిరిబాబు అన్నారు. మండలంలోని రాపాకలో ఆదివారం చేపట్టిన కులగణను పరిశీలించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి కులగణనను చేపట్టాలని సచివాలయం సిబ్బంది, వాలంటీర్లకు సూచించారు.

దువ్వాడ విస్తృత పర్యటన

టెక్కలి రూరల్ : స్వాగతం పలుకుతున్న నాయకులు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిఆంధ్రా వీధిలో ఎమ్మెల్సీ, టెక్కలి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ ఆదివారం పర్యటించారు. ఉదయానే తన అనుచరులతో ఆత్మీయంగా కలిసి వచ్చే ఎన్నికల్లో టెక్కలిలో వైసిపి జెండా ఎగరవేసే దిశగా కృషి చేయాలని కోరారు. అందులో భాగంగా ఎంపిటిసిలు దేవాది శాంతమ్మ, గోపిలను కలిశారు. వారు పూలదండలతో సన్మానించారు. అలాగే పలువురు ముఖ్య నేతలను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. కార్యక్రమంలో యర్ర వెంకటరావు, ఉర్జన శంకర్, చిన్నారావు, దాసరి వైకుంఠరావు, దాసరి మదీనా, పిలిమింటి రామారావు, యాగంటి శివరావు, టెక్కలి సర్పంచ్ ప్రతినిధి ధనుంజయరావు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలోని చిన్నసాన, రామేశ్వరం, కొత్తపల్లి, సరియాపల్లి, దంత, కురుడు, కిష్టుపురం, మాసాహెబ్‌పేట, తాటిపర్తి, నీలంపేట, పట్టుపురం, కస్తూరిపాడు, విశ్వనాథపురం పంచాయతీల్లో శ్రీనివాస్ పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సిఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు బాడాన మురళి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు దక్క రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు నూక సత్యరాజు, సర్పంచ్‌లు గొండు చాందని, పిట్ట భారతి, బి.పావని, కోతి చిన్నారావు పాల్గొన్నారు.

వైసిపికి దగ్గర పడింది

టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష

గౌతు శిరీష

ప్రజాశక్తి- పలాస

వైసిపి ప్రభుత్వానికి ఇంటికి పంపించే రోజులు దగ్గర పడ్డాయని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. పలాస టిడిపి కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి ఈ ఐదేళ్ల పాలనలో ఆయన ఆదాయం పెరగలేదని, ఉద్యోగాలు మాత్రం రాలేదని ఆరోపించారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక సంక్రాంతి కానుక, క్రిస్మస్ గిఫ్ట్, రంజాన్ తోఫా నిలిపివేశారని గుర్తు చేశారు. నాసిరకం మద్యం అందుబాటులోకి తీసుకురావడంతో ప్రజలు అనారోగ్యంతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్‌టిసి, విద్యుత్ ఛార్జీలు పెంచడంతో మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పలాస, వజ్రపుకొత్తూరు మండలాలకు వంశధార అందించలేకపోయారని విమర్శించారు. టిడిపి అధికారంలోకి వస్తే ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఐదేళ్లలో రూ.20 లక్షల ఉద్యోగాలు ఇచ్చేందుకు హామీ ఇస్తున్నామని అన్నారు. చెత్తపై పన్ను వేసిన చెత్త ముఖ్యమంత్రిగా జగన్ చరిత్రలో నిలిచిపోతారన్నారు.

సంక్షిప్త వార్తలు

చదువుతోనే జీవన ప్రమాణాల మెరుగు

కోటబొమ్మాళి: యాదవులు తమ పిల్లలను చదివించడం ద్వారానే జీవన ప్రమాణాలు మెరుగుపచుకోవాలని యాదవ ఉద్యోగుల సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు డొక్కర ధనుంజయరావు అన్నారు. మండలంలోని కొత్తపేట శివకేశవ పంక్షన్ హాల్లో ఆదివారం నిర్వహించిన యాదవ విద్యానవ చైతన్య సదుస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బడిఈడు పిల్లలను బడిబయట ఉంచకుండా చదివించాలన్నారు. అనంతరం నాయకులకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఎఎంసి వైస్ చైర్మన్ బొడ్డు వెంకటరమణ, యాదవ నాయకులు ముద్ద రామదాసు, బొడ్డు చెంచులు, బొడ్డు అప్పన్న, పిట్ట అప్పారావు, కొనారి సింహాచలం, పిలక ధనుంజయరావు, ఉల్లాకుల నీలకంఠేశ్వరరావు, కొర్రాయి చలపతిరావు పాల్గొన్నారు.

కళావేదిక నిర్మాణానికి శంకుస్థాపన

కంచిలి: మండలంలోని బూరగాం ఉన్నత పాఠశాలలో కళా వేదిక వేదిక నిర్మాణానికి స్థానిక సర్పంచ్ ప్రతినిధి బొడ్డు అప్పారావు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఎంపీ ల్యాండ్స్ రూ.5 లక్షలతో ఈ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. హెచ్‌ఎం రామకృష్ణ ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో ఎం.ప్రేమ్ కుమార్, సర్వేశ్వరరావు, కప్పు గోపీనాథ్, తిరుపతిరావు, కె.మేనరావ్, బి.ఢిల్లీరావు, లోకనాథం, రామారావు, గాంధీ, హేమరాజు, వంశీ పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న అప్పారావు

సమస్యల పరిష్కారానికే 'గడప గడపకు'

నరసన్నపేట : పోస్టర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

ప్రజాశక్తి- నరసన్నపేట

మండలంలోని మాకివలసలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ఆధ్వర్యాన ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ముద్రించిన పోస్టర్లను ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. 200వ రోజు చేరడంతో ప్లకార్డులు పట్టుకొని అభిమానులు కృష్ణదాస్‌కు స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైసిపి ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, వైసిపి సిఇసి సభ్యులు ధర్మాన పద్మప్రియ, బిసి సెల్ రాష్ట్ర జోనల్ ఇన్‌ఛార్జి ధర్మాన కృష్ణచైతన్య డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపిపిలు ఆరంగి మురళీధర్, ముద్దాడ భైరాగినాయుడు, వాన గోపి, జెడ్‌పిటిసి చింతు అన్నపూర్ణ, సర్పంచ్ రావాడ మోహన్, ఎంపిటిపి యాళ్ల పల్లలనాయుడు పాల్గొన్నారు.

ఆమదాలవలస : మండలంలోని దూసిపేటలో వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా? అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, మండల సచివాలయాల కో-ఆర్డినేటర్ బొడ్డేపల్లి నిరంజన్, సర్పంచ్ కనుగుల కిషోర్, సర్పంచ్ ప్రతినిధి బెండి దశరథ, ఎంపిడిఒ ఎస్.వాసుదేవరావు, ఎపిఎం పైడి కూర్మారావు పాల్గొన్నారు.

ఆమదాలవలస : మాట్లాడుతున్న చిరంజీవి నాగ్

వైసిపితోనే గ్రామాల అభివృద్ధి

పరిశీలిస్తున్న వైసిపి నాయకులు

పలాస: వైసిపి ప్రభుత్వంతోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని, రూ.లక్షల వ్యయంతో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్ వంటి పక్క భవనాలు నిర్మాణం చేపట్టి ప్రారంభం చేస్తున్నామని వైసిపి మండల అధ్యక్షుడు, పలాస పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు చిట్టి, ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయికృష్ణ అన్నారు. మండలంలోని మాకన్నపల్లిలో ఆదివారం నూతనంగా నిర్మాణం చేపట్టిన సచివాలయం భవనాన్ని వారు పరిశీలించారు. సోమవారం పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ప్రారంభిస్తారని అన్నారు. రూ. 45 లక్షలతో సచివాలయం, రూ. 21 లక్షలతో హెల్త్ క్లినిక్, రూ.15 లక్షలతో చెత్త సంపద కేంద్రం, రైతు భరోసా కేంద్రం, గొల్లమాకన్నపల్లి పాఠశాలలో నాడు-నేడు పథకం కింద రూ. 12 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను మంత్రి ప్రారంభిస్తారని చెప్పారు. సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉద్దానం ప్రాంత సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు సైని దేశయ్య, బొడ్డపాడు సర్పంచ్ తామడ మధన్, కొర్ల సంతోష్‌కుమార్, రాపాక ఢిల్లీరావు, కోరాడ ధనరాజ్ పాల్గొన్నారు.

పార్టీ కండువా వేస్తున్న ఎంపీ రామ్మోహన్ నాయుడు

విధానాలు నచ్చే టిడిపిలోకి...

కోటబొమ్మాళి: తెలుగుదేశం పార్టీ విధానాలు, క్రమశిక్షణ నచ్చే చేరానని సారవకోట మండలం మదనాపురం మాజీ సర్పంచ్ కోనారి సింహాచలం అన్నారు. శుక్రవారం రాత్రి మదనాపురంలో ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు సింహాచలంకు టిడిపి కండువ వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు, నరసన్నపేట మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆధ్వర్యాన పనిచేస్తానని అన్నారు. కార్యక్రమంలో కోటబొమ్మాళి, సారవకోట మండలాలకు చెందిన టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

దేవానందరెడ్డి పరామర్శ

కోటబొమ్మాళి: కోటబొమ్మాళికి చెందిన యుటిఎఫ్ నాయకుడు కామ్రేడ్ రామేశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎపి ప్రభుత్వ పరీక్ష సంచాలకులు, పూర్వ డిఇఒ దేవానందరెడ్డి ఆదివారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముందుగా రామేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకొని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. యుటిఎఫ్ నాయకులు వై.వాసుదేవరావు, గొండు నారాయణరావు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'

లావేరు : లావేరు శాఖాగ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఆదివారమూ చదవడం మాకిష్టం కార్యక్రమం ఉంటుందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇందులో భాగంగా వేమన శతకాలు, సుమతీ శతకాలు గురించి విద్యార్థులకు తెలియజేశారు.

బంటుపల్లిలో ద్రావణం తయారీ

రణస్థలం: మండలంలోని బంటుపల్లిలో వెలిసేటి అరుణ 1.50 సెంట్లు బొప్పాయి పంటకు వైరస్ తెగుళ్లను గమనించామని ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌ఛార్జి పెద్దింటి రాజేశ్వరి తెలిపారు. ఈ మేరకు ఆ బృందం పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలను అందించారు. ఈ వైరస్ తెగులు నివారణకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పేడ, మూత్రం, ఇంగువ, ద్రావణం ఆదివారం తయారు రైతులతో చేయించారు. ఈ తయారీ విధానం ఎకరాకు ఐదు లీటర్ల ఆవు మూత్రం, ఐదు లీటర్ల నీరు, ఐదు కిలోల పశువుల పేడను తీసుకొని ఈ మూడింటిని ఒక పాత్రలో వేసి నాలుగు రోజుల పాటు మురగ పెట్టాలని అన్నారు. ఆ తరువాత వంద గ్రాముల సున్నం, 150 గ్రాముల ఇంగువను వేడి నీటిలో కరగపెట్టి ఈ రెండింటినిపై ద్రావణంలో వేసి ఎకరాకు సరిపడ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఇలా పిచికారీ చేసుకోవడం వల్ల అన్ని తెగళ్లను ప్రకృతి వ్యవసాయ పద్ధతిల్లో సులువుగా నియంత్రించవచ్చును పేర్కొన్నారు.

పెంటిభద్రలో పల్లెపల్లెకు టిడిపి

పలాస: రాష్ట్రంలో రానున్నది టిడిపి ప్రభుత్వమని, వైసిపి నాయకులకు భయపడాల్సిన అవసరం లేదని టిడిపి బిసిసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి మూడో వార్డు పెంటిభద్రలో ఆదివారం పల్లెపల్లెకు టిడిపి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపి పాలనలో రాష్ట్రం, పలాస నియోజకవర్గం అభివృద్ధి చెందలేదని అన్నారు. మాజీ ఎమ్మెల్యే గౌతు శివాజీ హయాంలో పల్లపు ప్రాంతాలు, గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. టిడిపి అందజేస్తామన్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, సవర రాంబాబు, మల్లా శ్రీనివాసరావు, సత్యం, నాబిల్లి శ్రీనివాసరావు, ఉమాకాంత్, అంబటి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కామేశ్వరరావు